ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 14 అక్టోబరు 2024





పుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం

నేడు మద్యం దుకాణాలకు డ్రా

136 షాపులకు 3,300 దరఖాస్తులు

- అనకాపల్లిలో లాటరీ ప్రక్రియ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎక్సైజ్ అధికారులు

అనకాపల్లిటౌన్, అక్టోబర్ 13: జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం లాటరీ నిర్వహించనున్నారు. దీనికోసం అనకాపల్లి పట్టణంలోని లక్ష్మీ గ్రాండ్ కల్యాణ మండపంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో (జీవీఎంసీ పరిధిలోని అనకాపల్లి జోన్ మినహాయించి) ఎనిమిది ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 136 మద్యం షాపులకు లైసెన్సు కోసం 3,300 దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. ఒక దుకాణానికి దరఖాస్తు చేసుకున్న వారందరికీ వారి దరఖాస్తు సీరియల్ నంబర్ ప్రకారం టోకెన్‌లు ఇస్తారు. దరఖాస్తుదారులు వాటిని ఒక డబ్బాలో వేస్తే, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సమక్షంలో డబ్బాలోని టోకెన్‌లను బాగా కలిపి ఒక టోకెన్ తీస్తారు. టోకెన్ నంబర్ కలిగిన దరఖాస్తుదారుడికి దుకాణం కేటాయిస్తారు. దుకాణం దక్కించుకున్న వ్యక్తి అనుకున్న సమయానికి నిర్దేశించిన లైసెన్స్ ఫీజు వాయిదా చెల్లించనిపక్షంలో తర్వాత వారికి అవకాశం ఇచ్చేందుకు మరొక ఇద్దరిని ఎంపిక చేసి స్టాండ్‌బైగా ఉంచుతారు. డ్రా ప్రక్రియను ఉదయం ఏడు గంటలకే ప్రారంభిస్తారు. లాటరీలో దుకాణం పొందిన వ్యక్తి మద్యం అమ్ముకోవడానికి రెండేళ్లపాటు లైసెన్సు ఇస్తారు. లైసెన్స్ ఫీజును ఏడాదికోసారి చెల్లించాల్సి వుంటుంది. తొలుత అనకాపల్లి మండలం నుంచి లాటరీ తీయడం ప్రారంభిస్తారు. మధ్యాహ్నంకల్లా డ్రా ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు. ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం, గొలుగొండ సర్కిళ్ల పరిధిలో మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసిన వారు తమ వాహనాలను నూకాంబిక అమ్మవారి గుడి సమీపంలో, అనకాపల్లి, సబ్బవరం, చోడవరం, మాడుగుల సర్కిళ్ల దరఖాస్తుదారులు సత్యాగ్రాండ్ ఫంక్షన్ హాలు ఎదురుగా పార్కింగ్ చేసుకోవాల్సి వుంటుంది.



మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ నిర్వహించనున్న కల్యాణమండంలో ఏర్పాట్లు

ఉపమాకలో ఘనంగా ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

- పుష్కరిణిలో చక్రస్నానం, శమీపూజ
- పుణ్యకోటి వాహనంపై తిరువీధి సేవ

నక్కపల్లి, అక్టోబరు 13: మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. విజయదశమి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలు అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.రాత్రికి స్వామివారి పుష్కరిణి వద్ద సుదర్శనపెరుమాళ్ ఉత్సవమూర్తికి చక్రస్నానం చేయించారు. అనంతరం మండపం వద్ద స్వామివారిని వుంచి శమీపూజ, ఆయుధ పూజ చేశారు. రాత్రికి ఉభయదేవేరులతో స్వామివారిని పుణ్యకోటి వాహనంపై ఆశీనులను చేసి తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులు, శ్రీవారి సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గోవింద నామ స్మరణతో మాడవీధులు మార్మోగాయి.



పుణ్యకోటి వాహనంపై ఉభయదేవేరులతో మాడవీధుల్లో ఊరేగుతున్న ఉపమాక వెంకన్న

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు

ఫిబ్రవరి లేదా మార్చిలో నిర్వహించేందుకు ఈసీ యోచన

- మరోసారి పోటీలో సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ
- బరిలో మాజీ ఎమ్మెల్సీ గాదె, విశ్రాంత ఆర్ఐవో
- సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించిన మరికొందరు
- నవంబరు 6 వరకు ఓటర్ల నమోదు ప్రక్రియ



పాకలపాటి రఘువర్మ



గాదె శ్రీనివాసులునాయుడు

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వేడి ప్రారంభమయింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో నవంబరు 6వ తేదీ వరకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీకాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్నది. మరోసారి ఆయన పోటీకి సిద్ధపడుతుండగా, మరికొంత మంది ఆశావహులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ పర్యాయం పోటీచేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, రిటైర్డు అధికారులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఏపీటీఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ మరోసారి పోటీ చేస్తారని ఆ సంఘం ఇప్పటికే ప్రకటించింది. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కూడా బరిలో ఉంటానని వెల్లడించారు. తమ సంఘం నుంచి అభ్యర్థిని ఖరారు చేసేందుకు వీలుగా ఈనెల 15వ తేదీన యూటీఎఫ్ సమావేశం నిర్వహించనున్నది. మిగిలిన ప్రధాన సంఘాలు బరిలో నిలవాలా లేక భావ సారూప్యత కలిగిన సంఘాలతో కలిసి పోటీచేయాలా? అన్నదానిపై ఇంకా నిర్ణయానికి రాలేదు.

విశాఖ ఇంటర్‌బోర్డులో ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా పనిచేసి, ఈ ఏడాది జనవరిలో రిటైరైన ఆర్.సత్యనారాయణ ఎమ్మెల్సీగా పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల అధ్యాపకులకు వాట్సాప్ మేసేజ్‌లు పంపడమేకాకుండా స్వయంగా కలుస్తున్నారు. ఆనందపురం ఎంఈవోగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన పద్మావతి ఎమ్మెల్సీగా పోటీ చేయాలని సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇదిలావుండగా నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ ఎమ్మెల్సీగా పోటీచేయాలని నిర్ణయించి ఇప్పటికే పలువురు ప్రభుత్వ, ప్రైవేటు టీచర్లను కలిశారు. రాయలసీమకు చెందిన వైసీపీ సానుభూతిపరుడైన ఎమ్మెల్సీ మద్దతుతో బరిలో నిలవాలని ఆయన నిర్ణయించారు. వచ్చే నెల 23న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించనున్నందున అప్పటికి ఎమ్మెల్సీ బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత వస్తుందని ఉపాధ్యాయ సంఘనేతలు చెబుతున్నారు.

గోకులాలు వచ్చేస్తున్నాయ్!

కోటవురట్ల, అక్టోబర్ 13: గ్రామీణ ప్రాంతంలో పాడి పశువులకు నీడ కోసం గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మినీ గోకులాలు పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈసారి పశువులతోపాటు గొర్రెలు/మేకలు, కోళ్లకు కూడా షెడ్లు మంజూరు చేస్తున్నది. అన్ని కేటగిరీలకు రెండు రకాల షెడ్లు వుంటాయి. పశువుల షెడ్ల నిర్మాణ వ్యయంలో 90 శాతం సొమ్మును ప్రభుత్వం భరిస్తుంది. మేకలు/ గొర్రెలు, కోళ్ల షెడ్లకు అయ్యే వ్యయంలో 70 శాతం మేర రాయితీ వుంటుంది. ఈ పథకాన్ని ఉపాధి హామీ పథకం నిధులతో అమలు చేయనున్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రకటించారు.

పథకాన్ని పునరుద్ధరించిన కూటమి ప్రభుత్వం

- పశువులతోపాటు జీవాలు, కోళ్లకు కూడా షెడ్లు
- 90 నుంచి 70 శాతం వరకు రాయితీ
- ఉపాధి హామీ పథకం నిధులతో అమలు
- ఈ ఏడాది జిల్లాకు 1,750 యూనిట్లు మంజూరు

పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు, పాడి పశువులకు నీడ కోసం గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు 2018-19 ఆర్థిక సంవత్సరంలో మినీ గోకులాల పథకాన్ని అమలు చేసింది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద మూడు కేటగిరీల్లో షెడ్ల నిర్మాణానికి ప్రతిపాదించింది. రెండు పశువులకు షెడ్డు నిర్మాణం కోసం రూ.లక్ష, నాలుగు పశువులు అయితే రూ.1.5 లక్షలు, ఆరు పశువులు అయితే రూ.1.8 లక్షల చొప్పున నిధులు కేటాయించింది. యూనిట్ విలువలో పది శాతం సొమ్మును రైతు తన వాటాగా చెల్లించాలి. ఉపాధి హామీ పథకం నిధులతో మినీ గోకులాల నిర్మాణాలు చేపడుతున్నందున బిల్లులకు ఇబ్బంది వుండదన్న ఉద్దేశంతో చాలా మంది రైతులు గోకులాల నిర్మాణ పనులు చేపట్టారు. 2019 ఏప్రిల్ నాటికి సగానికిపైగా మినీ గోకులాల పనులు ప్రారంభమయ్యాయి. అదే నెలలో ఎన్నికలు జరగడం, మరుసటి నెలలో వైసీపీ అధికారంలోకి రావడంతో.. ఏప్రిల్ ఒకటో తేదీనాటికి 25 శాతం కంటే తక్కువ పనులు అయిన మినీగోకులాలను నిలిపివేయాలని, పనులు ప్రారంభించని వాటిని రద్దు చేయాలని ఆదేశించింది. దీంతో మినీ గోకులాల పథకాన్ని ప్రభుత్వం అటకెక్కించింది. నిర్మాణం పూర్తి చేసుకున్న రైతులకు రెండు, మూడేళ్ల తరువాత అరకొరగా బిల్లులు వచ్చాయి. ఈ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం వైసీపీ అధికారాన్ని కోల్పోయి, టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. అప్పట్లో రైతులకు ఎంతో ఉపయోగపడిన గోకులం పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది.

ఏ మండలానికి ఎన్ని యూనిట్లు

జిల్లాలోని 24 మండలాలకు మొత్తం 1,750 యూనిట్లు మంజూరయ్యాయి. అనకాపల్లి, కశింకోట, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి, కె.కోటపాడు, సబ్బవరం, కోటవురట్ల, మాడుగుల మండలాలకు 100 చొప్పున 800 యూనిట్లు, మాకవరపాలెం, రావికమతం, రోలుగుంట, చీడికాడ, మునగపాక, చోడవరం, నాతవరం మండలాలకు 75 చొప్పున 525 యూనిట్లు, గొలుగొండ, అచ్యుతాపురం, నక్కపల్లి, ఎస్.రాయవరం, పరవాడ, పాయకరావుపేట, రాంబిల్లి, ఎలమంచిలి మండలాలకు 50 చొప్పున 400 యూనిట్లు, నర్సీపట్నం మండలానికి 25 యూనిట్లు మంజూరయ్యాయి.



గతంలో టీడీపీ అధికారంలో వున్నప్పుడు రైతులు నిర్మించుకున్న గోకులాలు షెడ్డులు



పశువులతోపాటు జీవాలు, కోళ్లకు కూడా..

గోకులాల పథకంలో పశువులతోపాటు, జీవాలు (గొర్రెలు, మేకలు) కోళ్లకు కూడా షెడ్లు నిర్మించుకునే అవకాశం లభించింది. రెండు పశువులకు సరిపడ షెడ్డు నిర్మాణ వ్యయం రూ.1,15,000. ఇందులో రూ.1,03,500 ఉపాధి హామీపథకం ద్వారా సబ్సిడీగా అందుతుంది. రైతులు పది శాతం.. రూ.11,500 పెట్టుబడి పెట్టాలి. నాలుగు పశు వుల షెడ్డు నిర్మాణ వ్యయం రూ1,85,000, ఆరు పశువులు అయితే రూ.2,30,000 వ్యయం అవుతుంది. ఇందులో కూడా 90 శాతం సబ్సిడీ వుంది. 20 గొర్రెలు/ మేకలకు షెడ్డు కోసం రూ1,30,000, 50 గొర్రెలు/ మేకలకు షెడ్డు కోసం రూ2,30,000 ఖర్చు అవుతుంది. ఇందులో రైతులు 30 శాతం ఖర్చును భరించాల్సి ఉంటుంది. ఇక కోళ్లకు షెడ్డు నిర్మించుకునేందుకు వందకోళ్ల రూ.87,000 వ్యయం అవుతుంది. ఇందులో రూ.28,100 రైతులు భరించాలి. 200 కోళ్ల సరిపడ షెడ్డు విలువ రూ.1,32,000. రైతులు రూ.39,000 భరించాలి.

దరఖాస్తు ఎలా చేయాలంటే..

పశువులు, జీవాలు, కోళ్లకు నీడ కోసం షెడ్డు అవసరమైన రైతులు తగిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు జెరాక్స్ కాపీలను జత చేయాలి. సచివాలయంలో పశుసహాయకులు లేదా పశువైద్యశాలలో వైద్య సిబ్బందికి దరఖాస్తులు అందించాలి.

ఉప్పుటేరులో చేపలు మృత్యువాత

- మత్స్యకారులు ఆవేదన
- హెటెరో కాలుష్య వ్యర్థ జలాలే కారణమని ఆరోపణ




నక్కపల్లి, అక్టోబరు 13: మండలంలోని రాజయ్యపేట గ్రామానికి, వద్ద సముద్ర తీరానికి ఆనుకుని వున్న ఉప్పుటేరులో మత్స్యసంపద మృత్యువాత పడుతోంది. సముద్రంలో వేటకు వెళ్లలేని పరిస్థితుల్లో చాలా మంది మత్స్యకారులు ఉప్పుటేరులో చేపలను వేటాడి జీవనోపాధి పొందుతుంటారు. వందల ఎకరాల్లో విస్తరించి వున్న ఉప్పుటేరు తమకు ఉపాధి కల్పిస్తున్నదని మత్స్యకారులు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పెద్ద సంఖ్యలో చేపలు చనిపోయి ఉప్పుటేరు ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. వీటిని చూసి మత్స్యకారులు తీవ్ర ఆవేదన చెందారు. స్థానిక హెటిరో పరిశ్రమ నుంచి రసాయన వ్యర్థ జలాలను ఉప్పుటేరులోకి వదలడం వల్లే చేపలు చనిపోతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

ప్రకృతి అందాలకు నిలయం తాండవ

- చుట్టూ కొండలు, పచ్చటిచెట్లు
- బోట్ షికార్‌కు ఎంతో అనువు
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రజల వినతి

నాతవరం, అక్టోబరు 13: చుట్టూ కొండలు, మధ్యలో సువిశాలమైన జలాశయంతో చూపరుల మదిని దోచే తాండవ రిజర్వాయర్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు. నాతవరం, గొలుగొండ మండలాల్లో సుమారు 18.65 చదరపు కిలోమీటర్లు (4,608 ఎకరాలు) విస్తరించి వుంది. ఎగువున వున్న ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చే పలు వాగులు, గెడ్డల నీటిని ఆధారంగా చేసుకుని ఐదు దశాబ్దాల క్రితం దీనిని నిర్మించారు. తాండవ జలాశయం కింద అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 52 వేల ఎకరాల ఆయకట్టు వుంది. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో పదేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.10 లక్షలతో రాతి ఆనకట్ట దిగువున ఉద్యానవనం ఏర్పాటు చేసింది. నీరు-చెట్టు కార్యక్రమం కింద రాతి ఆనకట్ట మీద పూల మొక్కలు ఏర్పాటు చేశారు. దసరా తరువాత నుంచి సంక్రాంతి వరకు ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు కాకినాడ జిల్లా నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. కార్తీకమాసం వనభోజనాలతో సందడిగా వుంటుంది. సూర్యాస్తమయం వేళ డ్యామ్ మీద నుంచి చూస్తే ఆకాశానికి కుంచెతో రంగులు అద్దినట్టుగా ప్రకృతి అందం ఆవిష్కృతమవుతుంది. సువిశాలమైన తాండవ జలాశయంలో బోట్ షికారు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఇక్కడకు వచ్చే పర్యాటకులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గతంలో జాలర్ల ఇంజన్ బోటులో అప్పుడప్పుడు పర్యాటకులు విహరిస్తుంటారు. అయితే వీరివద్ద లైఫ్ జాకెట్లు లేకపోవడంతో బోట్ షికార్ అంత క్షేమం కాదు. అందువల్ల ప్రభుత్వం స్పందించి తాండవ రిజర్వాయర్‌లో బోట్ షికారు సదుపాయం కల్పించాల్సిన అవసరం వుంది. స్థానిక యువతకు శిక్షణతోపాటు రాయితీపై బోట్లు సమకూర్చితే వారికి ఉపాధి లభించడంతోపాటు పర్యాటకులు కూడా ఎంతో ఆనందిస్తారు. దీనివల్ల తాండవకు సందర్శకులు కూడా పెరుగుతారు. స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయిన చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవ తీసుకుని తాండవ జలాశయం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని కోరుతున్నారు.

సువిశాలమైన జలాశయం



కళకళలాడుతున్న తాండవ జలాశయం. దూరంగా ఎత్తైన కొండలు (ఇన్‌సెట్‌లో) మత్స్యకారుల బోటులో తాండవలో విహరిస్తున్న పర్యాటకులు

మాంసం దుకాణాలకు దసరా ఎఫెక్ట్

- చికెన్, మటన్ షాపుల వద్ద రద్దీ
- సాధారణ రోజుల్లో కన్నా ఎక్కువ ధరలకు అమ్మకం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13: జిల్లాలో చికెన్, మటన్ దుకాణాలు ఆదివారం కిటకిటలాడాయి. దసరా పండుగ రోజున అత్యధికులు మాంసాహారంతో భోజనం చేస్తుంటారు. కానీ ఈ ఏడాది దసరా పండుగ శనివారం రావడంతో మాంసాహారం తీసుకోలేదు. దీంతో ఆదివారం తెల్లవారుజాము నుంచే మాంసం దుకాణాల వద్ద కొనుగోలుదారులు బారులు తీరారు. సాధారణంగా ఆదివారం మాంసం అమ్మకాలు అధికంగానే వుంటాయి. ఈసారి దసరా పండుగ కూడా రావడంతో రెట్టింపు విక్రయాలు జరిగాయి. మాంసం దుకాణాలతో సంబంధం లేకుండా కొన్నిచోట్ల గొర్రెపోతులను కోసి, వాటాల వారీగా అమ్మకాలు సాగించారు. మరికొంతమంది దూపుడుపోతు మాంసం కొనుగోలుకు ఆసక్తి చూపారు. కాగా దసరా పండుగ కావడంతో మటన్, చికెన్ ధరలు పెరిగాయి. మటన్ కిలో రూ.800 నుంచి రూ.1,000 వరకు, బ్రాయిలర్ చికెన్ రూ.250 నుంచి రూ.280 వరకు విక్రయించారు. నాటుకోళ్లకు గిరాకీ అధికంగా వుంది. సుమారు కిలో బరువున్న కోడి రూ.1,000 పలికింది.



అనకాపల్లిలో ఓ మాంసం దుకాణాల వద్ద కొనుగోలుదారులు

మద్యం షాపుల వద్ద క్యూలు

- వీధుల్లో బహిరంగంగానే మద్యపానం

ఎలమంచిలి, అక్టోబరు 13: దసరా పండుగ కావడంతో పట్టణంలోని మద్యం దుకాణాల వద్ద ఆదివారం ఉదయాన్నే మందు బాబులు బారులు తీరారు. దుకాణాలకు సమీపం లోనే మద్యం సేవించడంతో పట్టణం లోని పలు ప్రాంతాలు ఓపెన్ బార్‌లుగా మారాయి. పట్టపగలు వీధుల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు. మందుబాబుల తీరు, పోలీసుల నిర్లిప్తతపై పలువురు మహిళలు మండిపడుతున్నారు. మద్యం షాపులు వున్న వీధుల్లో నుంచి రాకపోకలు సాగించాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎలమంచిలిలో ఓ మద్యం దుకాణం వద్ద క్యూలో నిల్చున్న కొనుగోలుదారులు (ఇన్‌సెట్‌లో) బహిరంగంగానే మద్యం సేవిస్తున్న దృశ్యం

క్రైం... crime news

భవానీలు వెళుతున్న మినీ బస్సును ఢీకొన్న వ్యాన్

- కలపాకకు చెందిన మహిళ దుర్మరణం
- అపస్మారకస్థితిలో మృతురాలి మనుమరాలు
- మరో ఆరుగురికి స్వల్ప గాయాలు
- రాజమండ్రి సమీపం కొవ్వూరు వద్ద ఘటన





దెబ్బతిన్న మినీ బస్సు వెనుక భాగం (ఇన్‌సెట్‌లో) అప్పలనర్సమ్మ (ఫైల్ ఫొటో)

పరవాడ/కొవ్వూరు, అక్టోబరు 13: మండలంలోని కలపాక గ్రామానికి చెందిన మహిళ రోడ్డు ప్రమాదంలో దుర్మరణ పాలయ్యారు. మృతురాలి మనుమరాలు అపస్మారకస్థితిలో ఉన్నారు. రాజమండ్రి సమీపంలోని కొవ్వూరు వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలపాక గ్రామానికి చెందిన 26మంది భవానీమాలలు ధరించారు. వీరంతా విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు శుక్రవారం రాత్రి స్వగ్రామం నుంచి మినీ బస్సులో బయలుదేరారు. సరిగ్గా వీరు ప్రయాణిస్తున్న మినీ బస్సు అర్ధరాత్రి దాటాక 2.30 గంటల సమయంలో రాజమండ్రి సమీపం కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోల్‌గేటు దాటిన తరువాత దొమ్మేరు వైపు ఆగింది. ఈ బస్సును రాజాం నుంచి పురికోస లోడుతో చిత్తూరు జిల్లా మదనపల్లి వెళుతున్న కర్ణాటకకు చెందిన వ్యాన్ వెనుక నుంచి ఎడమప్రక్కన ఢీకొట్టింది. దీంతో వెనుక సీటులో కూర్చున్న పోలవరపు అప్పలనర్సమ్మ (55) అక్కడికక్కడే దుర్మరణ పాలయ్యారు. పక్కనే కూర్చున్న మనుమరాలు పోలవరపు గిరీషా (16) అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. తల్లి సునీత, పి.నిహారిక, కురం భార్గవి, కె.నాగలక్ష్మి, ఇందల చిన్నమ్మ, ఈ.రామానాయుడులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సును లారీ బలంగా ఢీకొనడంతో వెనుకభాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనతో బస్సులో మిగిలిన వారంతా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఇదిలావుంటే, అప్పలనర్సమ్మ మృతదేహానికి కొవ్వూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అపస్మారక స్థితిలో ఉన్న మనుమరాలు గిరీషాను విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.ప్రస్తుతం ఆమెను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. స్వల్పంగా గాయపడినవారు ఇళ్లకు చేరారు. పండగ వేళ రోడ్డు ప్రమాదంలో అప్పలనర్సమ్మ మృతి చెందడంతో కలపాక గ్రామంలో విషాదం అలముకుంది.

కోళ్ల వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

- స్నేహితుడు ఇంటికి వచ్చి అనంతలోకాలకు



స్వామి (ఫైల్)

మాకవరపాలెం, అక్టోబరు 13: మండలంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారని ఎస్‌ఐ. దామోదరనాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోటవురట్ల మండల జల్లూరు గ్రామానికి చెందిన ఎల్. స్వామి (24) శనివారం సాయంత్రం ఇంటి వద్ద బైకుపై బయలుదేరి మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెం గ్రామంలోని తన స్నేహితుడు ఇంటికి వచ్చాడు. రాత్రి 9 గంటల సమయంలో లచ్చన్నపాలెం నుంచి మాకవరపాలెం బయలుదేరి కొండలఅగ్రహారం పెట్రోల్‌బంక్ వద్ద బైకు ఆపి రోడ్డుపక్కన నిలిచి ఇద్దరు మాట్లాడుతుండగా నర్సీపట్నం నుంచి వస్తున్న కోళ్లవ్యాను అతడ్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ దామోదరనాయుడు తెలిపారు. ప్రస్తుతం ఇతను విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అయితే గత ఆరు నెలలుగా ఇంటి వద్దే ఉండి ఉద్యోగం చేస్తున్నాడని, పండుగ రోజే చనిపోవడంతో ఈ కుటుంబంలో విషాదం అలుముకుంది.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : బాలుడు మృతి



మృతుడు జానికి రామ్ (ఫైల్)

రావికమతం, అక్టోబరు 13: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఏడేళ్ల బాలుడు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన తట్టబంద కోరుకొండ వారి కల్లాల వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుంది. కశింకోట మండలం గొన్నవానిపాలెం గ్రామానికి చెందిన గోకివాడ జానకిరామ్(7) మండలంలో తట్టబంద పంచాయతీ శివారు బూరుగుపాలెంలో అమ్మమ్మ ఇంటికి దసరా సెలవులకు వచ్చాడు. ఆదివారంతో సెలవులు ముగియడంతో సాయంత్రం బూరుగుపాలెం అమ్మమ్మ ఇంటి నుంచి మేనమామ నమ్మి రమణమూర్తి బైక్‌పై గొన్నవానిపాలెం తీసుకు వెళుతున్నాడు. తట్టబంద కోరుకొండ వారి కల్లాల వద్దకు బైక్ రాగా ఎదురుగా ముగ్గురు ఉన్న ద్విచక్రవాహనం వచ్చి ఢీకొట్టింది. దీంతో జానకిరామ్, రమణమూర్తిలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అనకాపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా జానకిరామ్ మార్గ మధ్యంలో మృతి చెందాడు. తీవ్ర గాయాలకు గురైన రమణమూర్తిని ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమైన గొర్లెపాలెంకు చెందిన ఇందలి చిరంజీవి, బాబూరావు, పోతురాజులు మద్యం పూటుగా సేవించి అతి వేగంతో ఒకే బైక్‌పై వస్తూ ఎదురుగా వస్తున్న రమణమూర్తి బైక్‌ను ఢీకొట్టారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై రావికమతం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగా ప్రమాదంపై ఫిర్యాదు రాలేదన్నారు.

లారీ ఢీకొని వివాహిత మృతి

అనకాపల్లి టౌన్, అక్టోబర్ 13 : ఇక్కడి జలగలమదుం జంక్షన్ వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి అనకాపల్లి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలివి. పట్టణంలోని గవరపాలెం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మునగపాక నాగమణి (52) భర్త అప్పారావుతో కలిసి ఏలేరు కాలువలో ఆదివారం కనకదుర్గమ్మ విగ్రహం అనుప చేశారు. తిరిగి అనకాపల్లికి ద్విచ వాహనంపై వస్తుండగా, వీరిని జలగలమదుం జంక్షన్ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగమణి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. అప్పారావుకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన మౌనిక

ఎస్.రాయవరం, అక్టోబరు 13 : కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ విభీషణరావు తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన అప్పలనాయుడు ఇక్కడికి సమీపంలో ఉన్న ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలిసి తిమ్మాపురంలో నివాసం ఉంటున్నాడు. ఇతని భార్య మౌనిక కడుపునొప్పితో బాధపడుతుంది. శుక్రవారం ఉదయం నుంచి విపరీతంగా కడుపునొప్పి రావడంతో తాళలేక సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. ఆ సమయంలో విధుల నుంచి అప్పుడు వేచ్చిన భర్త అప్పలనాయుడు చూసి వెంటనే అడ్డరోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి సోరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	122.00
లైవ్ ధర	142.00
విత్ స్కిన్	254.00
స్కిన్ లెస్	264.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

వెంకన్న క్షేత్రంలో అలరించిన వినోద ఉత్సవం

పుష్కరిణి వద్ద చక్రస్నానం, శమీపూజ

- పుణ్యకోటి వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- ఉపమాకలో ఘనంగా ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



ఉంగరం వెతికేందుకు ముసుగేసుకుని పల్లకీలో వెళుతున్న స్వామివారు



ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావును విచారిస్తున్న అర్చకులు



ఉంగరం దొరికిందని చూపుతున్న ప్రధానార్చకులు



ఆలయానికి వచ్చిన దంపతులను విచారిస్తున్న ప్రధానార్చకులు

నక్కపల్లి, అక్టోబరు 13 : మండలంలోని ఉపమాక క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలోనే శ్రీవారి బంగారు ఉంగరం మాయమైంది. ఈ విషయం తెలిసిన అర్చకులు పలువురిపై అనుమానం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ఆలయానికి దర్శనం కోసం సుదూర ప్రాంతం నుంచి వచ్చిన భక్తులను స్వామివారి ఉంగరం మీరే తీశారు ? ఇస్తారా... ? లేదా పోలీసులకు చెప్పాలా... ? అంటూ నిలదీశారు.

విశాఖకు సమీపాన ఒక పరిశ్రమకు చెందిన డైరెక్టర్ దంపతులు స్వామివారిని దర్శించుకోవడానికి శనివారం ఉపమాక వచ్చారు. దీంతో ఆ దంపతులే స్వామి ఉంగరం తీశారని ఆలయ అర్చకులు నిందలేశారు. దీంతో వారు హడలిపోయారు. 'చాన్నాళ్ల నుంచి ఉపమాక స్వామిని చూడాలనిపించింది. విజయదశమి రోజు దర్శనానికి వస్తే ఉంగరం తీశామని ఇలా నిందలేస్తారా... ?' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. చివరకు స్వామివారి వినోద ఉత్సవంలో భాగంగా ఈ తంతు జరిగిందని తెలుసుకున్న ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మాడవీధుల్లో స్వామివారు పడేసుకున్న ఉంగరాన్ని వెతికే కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, నందూరి రాజగోపాలాచార్యులు ఆద్యంతం భక్తులను పరవశింపజేసేలా నిర్వహించారు. ఈ సమయంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, ఆలయ అర్చకులు, పరిచారికులను కూడా ప్రధానార్చకులు మెడలో తాడువేసి మాడవీధుల్లో విచారించారు. చివరకు స్వామివారి చెంతనే ఉంగరం దొరికిందని ప్రసాదాచార్యులు చూపడంతో అందరూ సంతోషం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా గోవిందనామస్మరణతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి. తదుపరి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామివారి పుష్కరిణి వద్ద సుదర్శనపెరుమాళ్ ఉత్సవ మూర్తికి చక్రస్నానం చేయించారు.

అంబరాన్నంటిన కనకదుర్గమ్మ సంబరం

- అనకాపల్లిలో ఎటుచూసినా జనసందోహం
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సినీ హీరో, హీరోయిన్లు
- భారీ ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు



ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం



అనకాపల్లి టౌన్, అక్టోబరు 13: పట్టణంలోని గవరపాలెం సతకంపట్టు వద్ద ఉన్న కనకదుర్గమ్మ సంబరం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఏడు గంటలకు ప్రారంభమైన ఉత్సవం ఆదివారం వేకువజాము మూడు గంటల వరకు సాగింది. ఏటా దసరా రోజున జరిగే ఉత్సవాన్ని ఈ ఏడాది మరింత వైభవోపేతంగా నిర్వహించారు. నవదుర్గల విగ్రహాల ఊరేగింపునకు ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం నుంచి సాగిన నవదుర్గల ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. అమ్మవారిని సినీ హీరోలు సందీప్ కిషన్, లగడపాటి విక్రమ్ సహిదేవ్, హీరోయిన్ సంధ్య, తారక్ పొన్నప్ప, దర్శకుడు నక్కిన త్రినాథరావు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వీరికి ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, పీవీ రమణ, భీమరశెట్టి వరహా నూకరాజు తదితరులు సత్కరించారు. సినీ హీరో, హీరోయిన్లు, దర్శకుడు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉత్సవ పూర్వపు అధ్యక్షుడు జయవీర్ ఆధ్వర్యంలో మేళతాళాలు, నేలవేషాలు, పులివేషాలతో ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా రింగురోడ్డు, గవరపాలెం పరిసర ప్రాంతాల్లో సుమారు 15 స్టేజ్ ప్రోగ్రాములు ఏర్పాటు చేశారు. వీటిని తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, వ్యవస్థాపకులు పీవీ రమణ, చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.



అమ్మవారిని దర్శించుకున్న హీరో, హీరోయిన్లు

హోరాహోరీగా గుర్రపు పరుగు పందేలు

- ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కోటనందూరు, రామన్నపాలెం గుర్రాలు



పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు అబద్ధం



పాఠశాల మైదానంలో పరుగు తీస్తున్న గుర్రం

ఎస్.రాయవరం, అక్టోబరు 13: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ధర్మవరం అగ్రహారంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందేలు ఉత్సాహ భరిత వాతావరణంలో సాగాయి. తొలుత ఈ పోటీలను టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి పదమూడు మంది యజమానులు గుర్రాలతో పోటీలకు హాజరయ్యారు. ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో కోటనందూరుకు చెందిన గుర్రం మొదటి స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో చోడవరం మండలం రామన్నపాలెం, తృతీయ స్థానంలో మునగపాక మండలం రాయపురాజుపేట గ్రామాలకు చెందిన గుర్రాలు నిలిచాయి. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విజేతలకు నిర్వాహకులు రూ. ఇరవై వేలు, రూ.పదిహేను వేలు, రూ.పది వేలు, రూ. ఎనిమిది వేలు, రూ.ఆరు వేలు చొప్పున నగదు బహుమతులను గ్రామ పెద్దల చేతుల మీదుగా అందజేశారు. ఇదిలావుంటే, రాత్రి ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారంతో ఈ వేడుకలు ముగియడంతో దుర్గామాత విగ్రహాన్ని మేళతాళాలు బాజా భజంత్రీల నడుమ ఊరేగించి నిమజ్జనమ చేశారు. టీడీపీ మండల యువత అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సర్పంచ్ కలిగట్ల రత్నం, ఎంపీటీసీ సభ్యురాలు సియ్యాదుల వరహాలమ్మ, ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, సియ్యాదుల అచ్యుత్ తదితరులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పట్టపగలు జి.సన్యాసిరాజుపాలెంలో చోరీ

- ఎనిమిదిన్నర తులాల బంగారు. 20 తులాల వెండి ఆభరణాలు, రూ.మూడు లక్షల నగదు అపహరణ



ఇంట్లో తెరచి ఉన్న బీరువా

కోటవురట్ల, అక్టోబర్ 13 : పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగి బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ.మూడు లక్షల నగదు అపహరణకు గురయ్యాయి. ఇందుకు సంబంధించి బాధితుడు పంచదార్ల రామకృష్ణ తెలిపిన వివరాలివి. కోటవురట్ల మండలం నీలిగుంట పంచాయతీ శివారు గొల్లలు సన్యాసిరాజుపాలెం గ్రామంలో నివాసం ఉంటున్న పంచాదార్ల రామకృష్ణ శనివారం అత్తవారింటికి పండగకు వడ్డాది వెళ్లాడు. ఇతని తల్లి నాగరత్నం ఆదివారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో పొలంలోకి వెళ్లింది. వ్యవసాయ పనులు చేసుకొని ఉదయం పదకొండు గంటల సమయంలో ఆమె తిరిగి ఇంటి వచ్చింది. తలుపులు తీసి ఉండడం, ఇంట్లోని బీరువాలో బట్టలు చెల్లాచెదురుగా పడిఉండడాన్ని గుర్తించి వెంటనే కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించింది. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలో ఉంచిన ఎనిమిదిన్నర తులాల బంగారం, ఇరవై తులాల వెండి ఆభరణాలు, రూ.మూడు లక్షల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. బ్రాందీ షాపు టెండర్ కోసం రూ.ఐదు లక్షలను ఓ వ్యక్తి వద్ద అప్పుగా తీసుకున్నానని, రెండు లక్షలు టెండర్‌కు కట్టి మిగతా నగదు ఇంట్లో బీరువాలో ఉంచగా చోరీకి గురైనట్టు రామకృష్ణ వాపోయాడు. దీనిపై పోలీసులను వివరణ కోరగా, ఫిర్యాదు అందినట్టు చెప్పారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- ఆటోలో పోయిన బంగారు వస్తువుల కేసులో నిందితుల అరెస్టు
- రూ.5లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం

గండేపల్లి, అక్టోబరు 13: బంగారు వస్తువులు కనిపించకపోవడంపై ఈనెల 11న గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే కేసు నమోదైన 24 గంటల్లోనే జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ నేతృత్వంలో గండేపల్లి ఎస్‌ఐ యువి శివనాగబాబు సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేసి కేసును ఛేధించి అంతర్‌జిల్లాల దొంగల ముఠాను అరెస్టు చేశారు. దీనిపై శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శివనాగబాబు వివరాలు వెల్లడించారు. ఈనెల 7న విశాఖపట్నానికి చెందిన మొల్లేటి సుగుణ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఏలేశ్వరంలోని తన అక్క ఇంటికి వచ్చి అక్కడి నుంచి తన అమ్మమ్మ ఊరు గండేపల్లి మండలం మురారి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఈ సమయంలో ఆటోలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె బ్యాగులో ఉన్న బంగారు వస్తువులను దొంగలించారు. ఆమె ఇంటికి వెళ్లి బ్యాగు తెరిచి చూడగా అందులో బంగారు వస్తువులు కనిపించకపోవడంతో గండేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే అప్రమత్తమై సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా పెట్టి ఈనెల 12న మురారి శివారున అంతరజిల్లా దొంగలను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన రావుల దుర్గ, మేరకనపల్లి వెంకటేశ్వరరావు, విజయనగరం జిల్లా కొత్తవసలకు చెందిన గంటా రేవతి, అనకాపల్లి జిల్లా గొల్లం కెకోటపాడుకు చెందిన రావుల వసంత, తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలానికి చెందిన నాగులూరి శివపార్వతిని అరెస్టు చేశామన్నారు. వారిపై గతంలో పాత కేసులు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు రూ.5లక్షలు 100 గ్రాముల బంగారపు ఆభరణాలు, టాటా ఇండిగో సీఎస్ కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్టు తెలిపారు.

స్పీకర్ అయ్యన్నను కలిసిన పీలా గోవింద్



అయ్యన్న సత్కరిస్తున్న పీలా గోవింద

నర్సీపట్నం, అక్టోబరు 13: ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పీలా గోవింద సత్యనారాయణ స్పీకర్ అయ్యన్నపాత్రుడుని ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా కలిశారు. తన నియామకానికి కృషి చేసిన సభాపతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు పెంపు కోసం జరుగుతున్న ప్రణాళికలను స్పీకర్‌కి వివరించారు. అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఇరువురు మధ్య కొద్దిసేపు చర్చ జరిగింది, ఈ కార్యక్రమంలో అనకాపల్లికి చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 20 మందికి గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 13: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం దుగ్గాడ గ్రామానికి చెందిన భవానీ భక్తులు రెండు టాటా ఏస్ వాహనాల్లో విజయవాడ వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 మందికి గాయాలు అయ్యాయి. వీరి వాహనాల్లో ఒకటి మరమ్మతులకు గురి కావడంతో ఒకదానికొకటి కట్టుకుని తిరిగి ఇంటికి బయలుదేరారు. కొవ్వూరు టోల్‌ప్లాజా సమీపంలోని బ్రిడ్జి దాటుతుండగా టాటా ఏస్ వాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రెండు టాటా ఏస్ వాహనాలు బోల్తాపడ్డాయి. ఈ ఘటనలో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. రాత్రి గస్తీలో ఉన్న పట్టణ సీఐ పి.విశ్వం క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఆస్పత్రులకు తరలించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకా మాజీల పేర్లు

- మండల పరిషత్ అధికారుల నిర్లక్ష్యం
- మండిపడుతున్న కూటమి నేతలు



మండల పరిషత్ కార్యాలయంలో మాజీ ప్రతినిధులతో దర్శనమిస్తున్న బోర్డు

మాకవరపాలెం, అక్టోబరు 13: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం ఇంకా మాజీ ప్రతినిధుల పేర్లతో బోర్డులు దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మండల పరిషత్ కార్యాలయంలోని బోర్డులపై వైసీపీ నాయకుల పేర్లు ఉంచడంపై కూటమి నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని వారు మండిపడుతున్నారు. అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్, నర్సీపట్నం ఎమ్మెల్యేగా చింతకాయల అయ్యన్నపాత్రుడు గెలుపొందారు. అయ్యన్నపాత్రుడు స్పీకర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయినా మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న బ్లాక్ బోర్డుపై అనకాపల్లి ఎంపీగా భీశెట్టి వెంకటసత్యవతి, నర్సీపట్నం శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్‌గణేశ్ పేర్లు దర్శనమిస్తున్నాయి. కార్యాలయానికి వచ్చిన వారంతా వీరు పేర్లు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారులు ఈ బోర్డులు మార్చాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



అస్తవ్యస్తంగా మారిన సత్యనారాయణపురం పంచాయతీ ప్రధాన రోడ్డు

గోతులమయంగా సత్యనారాయణపురం ప్రధాన రహదారి

▸ ఏళ్ల తరబడి పట్టించుకునేవారు కరువు

▸ రాకపోకలకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



కొత్తూరు, అక్టోబర్ 13 : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీలో ప్రధాన రోడ్డును ఏళ్ల తరబడి పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా అస్తవ్యస్తంగా మారింది. ఈ కారణంగా పంచాయతీలో ఉన్న మూలపేట గ్రామం, పోస్ట్‌మాన్ కాలనీ ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడుగడుగునా గోతులో రోడ్డు దర్శనమిస్తోంది. వర్షాలు కురిసినప్పుడు ఆ నీరు అందులో చేరుతుండడంతో గొయ్యి ఎక్కడుందో, రోడ్డు ఎక్కడుందో తెలుసుకోవడం కష్టంగా ఉందంటున్నారు.

దొంగగెడ్డ పొంగితే రోడ్డుపైనే వర్షపు నీరు

ఇదిలావుంటే, సత్యనారాయణపురం పంచాయతీలో అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న వర్షం పడితే రోడ్డుపై దొంగగెడ్డ నీరు చేరి చెరువును తలపిస్తుంది. అటువంటి సమయాల్లో రాకపోకలకు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అక్కడివారు చెపుతున్నారు. గత్యంతరం లేక మరోపది కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి మూలపేట, సత్యనారాయణపురం గ్రామాల్లోకి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ సమస్యను ఇటీవల ఎంపీ సీఎం రమేష్ దృష్టికి సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి తీసుకు వెళ్లారు. ఉన్నతాధికారులు వెంటనే ఈ సమస్యపై స్పందించాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వర్షాలు కురిసే సమయాల్లో రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి ప్రవహిస్తున్న దొంగగెడ్డ (ఫైల్)

హోం మంత్రికి 'జనవాణి' అర్జీలు

▸ పరిష్కారానికి ఆయా శాఖలకు పంపనున్నట్టు అనిత వెల్లడి



హోం మంత్రి అనితకు ఫిర్యాదులను అందజేస్తున్న శివదత్ తదితరులు

నక్కపల్లి, అక్టోబరు 13 : మండల కేంద్రమైన నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నెల రోజుల పాటు జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి సుమారు మూడు వందలకు పైగా వినతులు, ఫిర్యాదులు పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ నేతృత్వంలో స్వీకరించారు. వీటిని ఆదివారం జనసైనికులు హోం మంత్రి అనితకు అందజేశారు. స్థానికంగా ఉన్న మంత్రి నివాసానికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఫిర్యాదులను ఆయా ప్రభుత్వ విభాగాలకు పంపనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, పాము గణేశ్, యలమంచిలి చంద్రరావు, రాజా, బంగారి రాజు, పిక్కి గోవింద్, వెదుళ్ల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్‌ను ఆదివారం మంత్రి వంగలపూడి అనిత ఇక్కడ సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి పాలనలో పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలందించడంలో నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మరిడి మహాలక్ష్మి హారం వివాదంపై త్వరలో విచారణ

నర్సీపట్నం, అక్టోబరు 13 : మరిడి మహాలక్ష్మి అమ్మవారి హారం వివాదంపై శాఖాపరమైన విచారణకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అమ్మవారి బంగారు ఆభరణాలలో 390 గ్రాముల హారం గిల్ట్ నగ నిర్ధారణ కావడంతో తీవ్ర సంచలనంగా మారింది. ఇందుకు బాధ్యుడిని చేస్తూ ఆలయ ఈవో గంగారావుని దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆయన్ని సస్పెండ్ చేశారు. తాను ఏ తప్పు చేయలేదని, సస్పెన్షన్‌ని ఎత్తివేయాలని ఈవో గంగారావు హైకోర్టుని ఆశ్రయించారు. దీంతో హైకోర్టు శాఖా పరమైన విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. నర్సీపట్నం మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయం పూర్వం నుంచి అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యుల నిర్వహణలో ఉండేది. ఆలయంలో అర్చకుల జీతాలు, కరెంటు బిల్లులు, పండగ వ్యవహారాలు వారి కుటుంబ సభ్యులు చూసుకునేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2022 ఆగస్టు 2 తేదీన ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నారు. ఆ ఏడాది జరిగిన పండగలో అమ్మవారికి ఆభరణాలు అలంకరించ లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 19 తేదీన మాజీ మునిసిపల్ వైస్ ఛైర్మన్ చింతకాయల సన్యాసపాత్రుడు 510 గ్రాముల బంగారం ఆభరణాలు, ఐదున్నర కిలోల వెండి వస్తువులను దేవదాయ శాఖ అధికారులకు అప్పగించారు. దేవదాయ శాఖ నగల వెరిఫికేషన్ అధికారి, ఎప్రైజర్ (బంగారం నాణ్యత నిర్ధారణ ప్రతినిధి) నగలు పరిశీలించి, బంగారం ఆభరణాలుగా నిర్ధారించారు. నగలు వివరాలు అధికారికంగా రికార్డులలో నమోదు చేసి ఈవో గంగారావు, జేవీవో, ఎప్రైజర్ సంతకాలు చేశారు. మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా ఏప్రిల్ 21 తేదీన బంగారు నగలు అమ్మవారికి అలంకరించడానికి ఈవో గంగారావు అర్చకులకు అందజేశారు. పండగ ముగిసిన తర్వాత మే 2 తేదీన దేవదాయ శాఖ ఈవో అర్చకుల నుంచి నగలు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు లాకరులో పెట్టడానికి అవకాశం లేక ఒక బాక్సులో ఆభరణాలు పెట్టి సీల్ చేసి నర్సీపట్నం సబ్ ట్రెజరీలో భద్రపరిచారు.రెండేళ్ల క్రితం దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకున్న మరిడితల్లి ఆలయం నిర్వహణను ఆగస్టు నెలలో ఆలయ ధర్మకర్త, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ అధికారులు అమ్మవారి ఆభరణాలు అప్పగించేటప్పుడు స్పీకర్ బంగారం నాణ్యత నిర్ధారణ చేయించారు. ఆభరణాలలో 390 గాములు బరువు ఉన్న అమ్మవారి హారం గిల్ట్ నగ అని తేలడంతో ఎండోమెంట్ అధికారుల నుంచి సభాపతి అయ్యన్నపాత్రుడు నగలు తీసుకోలేదు. ఆగస్టు 22 తేదీన దేవదాయ శాఖ జిల్లా అధికారి సుధారాణి నర్సీపట్నం ఎండోమెంట్ కార్యాలయంలో జేవీవో, ఎప్రైజర్‌ని పిలిపించి మరోసారి నగలు తనిఖీ చేశారు. హారం గిల్ట్ అని తేలడంతో ఎండోమెంట్ కమిషనర్‌కి నివేదిక పంపారు. దీని మీద ఇన్‌చార్జి ఈవో దివ్యజ్యోతి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ప్రమేయం లేకుండా ట్రెజరీ నుంచి బంగారం ఆభరణాలు బయటకు తీసుకు వెళ్లారని ఈవో కూడా దివ్యజ్యోతి మీద పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమ్మ బయలెల్లినాదో...

▸ ఘనంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు ▸ వాడవాడలా కొలువుదీరిన దుర్గామాత విగ్రహాలు నిమజ్జనం



అనకాపల్లి పట్టణంలో దుర్గామాత విగ్రహాన్ని మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకు వెళుతున్న భక్తజనం



నక్కపల్లిలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సామూహిక కలశ పూజ



సబ్బవరం మండలం దేవీపురంలో అమ్మవార్ల అవతారాలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 : ఆదిమాత.. జగజ్జనని.. దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా సాగాయి. శనివారం రాత్రితో ఈ వేడుకలు ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు ఆలయాల్లో, వీధివీధిన ఏర్పాటు చేసిన మండపాల్లో కొలుదీరిన అమ్మను అంతా అత్యంత భక్తిశ్రద్ధలతో కొలుసుకున్నారు. ఇదిలావుంటే, అనకాపల్లి నూకాంబిక ఆలయంలో ఆదివారం ఉదయం అమ్మవారికి పూర్ణాహుతి నిర్వహించారు. ఉత్సవమూర్తికి అభిషేకాలు జరిపారు. గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాలను భక్తులు మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకు వెళ్లి శారదా నదిలో నిమజ్జనం చేశారు.

కశింకోట : శరన్నవరాత్రి శనివారం రాత్రితో ముగిశాయి. తొమ్మిది రోజులు పాటు కనకదుర్గమ్మకు మండల ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. పలువురు భవానీ మాలధారణలు ధరించి ఆరాధించారు. ఆదివారం భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో కశింకోటలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాలను కోలాహల వాతావరణం నడుమ ఊరేగించారు. పెద్ద సంఖ్యలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కశింకోటలో కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు తరలి వచ్చిన భక్తులు

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్ : విజయదశమి వేడుకలను మండల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విజయదశమి సందర్భంగా పట్టణంలోని అన్ని ఆలయాలు, అమ్మవారి మండపాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్థానిక బృందావనంలోని దుర్గాలమ్మచెట్టు ఆలయంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని కనకదుర్గ అమ్మవారిని వివిధ పుష్పాలతో అలకరించారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గానగర్‌లో కనకదుర్గతోపాటు రామాలయం వద్ద వేదికపై ఏర్పాటుచేసిన కనకదుర్గ అమ్మవారికి మంత్రి పూజలు జరిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు. కాగా విజయదశమి పురస్కరించుకుని ఆలయాల్లో జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అలాగే, మండలంలోని గ్రామ గ్రామాన శరన్నవరాత్రి ఉత్సవాలను నేత్రపర్వంగా జరుపుకున్నారు. మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ఆదివారం రాత్రి ఊరేగించి నదులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

సబ్బవరం : మండలంలో దేవీనవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేవీపురంలో శనివారం సహస్రాక్షి అమ్మవారు మహిషాసుర మర్ధిని, దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవతల ఉత్సవమూర్తులను ఊరేగించారు. అంతకు గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో హోమం, షోడశోపచార పూజలు జరిపారు.

నక్కపల్లి : మండల కేంద్రమైన నక్కపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విజయదశమి పర్వదినం సందర్భంగా శనివారం ఆర్య వైశ్య మహిళా సంఘం ప్రతినిధులు సామూహిక కుంకుమ, కలశ పూజలు నిర్వహించారు. సుమారు 108 కలశాలను ఏర్పాటు చేశారు. దుర్గాఅష్టోత్తరం, కనకధార స్తోత్రం, దుర్గాసూక్తం వంటి పూజలు చేశారు.

ఎలమంచిలి : దసరా పండగను మండల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అంతా శనివారం ఉదయం ఆదిమాతను ఇళ్లలో మనసారా ఆరాధించారు. వాహన పూజలు జరుపుకున్న అనంతరం అమ్మవార్ల ఆలయాలు, వీధివీధిన వెలసిన మండపాలకు వెళ్లి దర్శించుకున్నారు. దీంతో ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది.

ఘనంగా శూలాల మహోత్సవం



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు



తిమ్మరాజుపేటలో సారెను ఊరేగింపుగా తీసుకు వెళుతున్న భక్తులు

అచ్యుతాపురం రూరల్, అక్టోబరు 13 : శూలాల మహోత్సవాన్ని మండలంలోని హరిపాలెం, అందలాపల్లి, తిమ్మరాజుపేట గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. అందలాపల్లి భగీరథీ అమ్మవారి ఆలయంలో, హరిపాలెంలో రామాలయం వద్ద, కొండ సమీపంలో మరోచోట ఈ వేడుకను అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. తిమ్మరాజుపేటలో జగ్గారావు మిత్రమండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం రాత్రికి గ్రామంలో మహిళలంతా ఘటాలను తలపై ఉంచుకుని, సారెను ఊరేగింపుగా తీసుకు వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా శూలాలను శరీరానికి గుచ్చుకుని తమ భక్తిని చాటుకున్నారు. ఊరేగింపులో దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరికొందరు బుగ్గ శూలాలు, నాలుక శూలాలు, రథం శూలాలు, గంప శూలాలను ధరించి అగ్నిగుండం తొక్కారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు సిహెచ్.నర్సింగరావు, నమ్మి గణేష్‌లు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందజేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

పరవాడ, అక్టోబరు 13 : మండల కేంద్రం పరవాడ బొంకుల దిబ్బయూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు శనివారం రాత్రి వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అలాగే లక్కీడ్రా విజేతలకు కూడా బహుమతులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ బండారు రామారావు, స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, పైలా అప్పలనాయుడు, వర్రి పైడంనాయుడు, బొంకులదిబ్బ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పైలా హరీష్, పైలా వెంకటరావు, చీపురుపల్లి శ్రీనివాసరావు, పైలా పైడంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో రేవతికి పతకం



పోటీల్లో పతకాలు అందుకున్న రేవతి తదితరులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 : హిమాచల్‌ప్రదేశ్‌లోని నగ్రోటా బగ్వాన్‌లో ఈ నెల ఆరో తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగిన యూత్, జూనియర్, సీనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన అనకాపల్లి జిల్లాకు చెందిన ఎ.రేవతికి బ్రాంజ్ మెడల్ సాధించినట్టు అనకాపల్లి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధి జి.వెంకటరామ ఆదివారం తెలిపారు. జూనియర్స్ విభాగంలో అనకాపల్లి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు గర్విస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

వైభవంగా శ్రవణ నక్షత్ర పూజలు



పరవాడ, అక్టోబరు 13 : ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొండపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రవణ నక్షత్ర పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, స్తోత్రనామాలతో అర్చనలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

'దేవర' విలన్‌కు అభిమానులు సత్కారం



తారక్‌ను సత్కరిస్తున్న నందమూరి అభిమానులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 : జూనియర్ ఎన్టీఆర్ హీరోగా విడుదలైన 'దేవర' చిత్రంలో విలన్ పాత్ర పోషించిన తారక్ పొన్నప్పను ఆదివారం నందమూరి అభిమానులు ఘనంగా సత్కరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనకాపల్లికి విచ్చేసిన ఆయనను నందమూరి బాలకృష్ణ, ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు మళ్ల సంతోష్ కలిసి సత్కరించారు. అనంతరం నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో మద్దాల భీమేష్, బొడ్డేడ గిరీష్, సాయి, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చిన యువకులు



రహదారిపై గుంతలను పూడ్చిన యువకులు

నక్కపల్లి, అక్టోబరు 13 : రాజయ్యపేటలో ప్రధాన రహదారిపై పడిన గుంతలతో తరచూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తించిన గ్రామ యువకులు ఆదివారం నడుం బిగించారు. ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి ఇక్కడ సమస్య వెళ్లినా పట్టించుకోలేదు. దీంతో పిక్కి స్వామి నేతృత్వంలో పేర్ల నల్ల, పొన్నాడ భూలోక, పిక్కి కుమారస్వామి తదితరులు ఇటుక, సిమెంట్, గ్రావెల్ తదితర మెటీరియల్ తీసుకువచ్చి రెండు చోట్ల భారీ రంధ్రాలను పూడ్చివేశారు.

పోటాపోటీగా ఎడ్లపరుగు పందెం

చీడికాడ, అక్టోబరు 13: అప్పలరాజు పురంలో శనివారం సాయంత్రం ఎడ్ల పరుగు పోటీలు సందడిగా జరిగాయి. దసరా నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా జరిగిన పోటీలకు అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన 25 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో విజేతలు సెకండ్ల తేడాలో గెలుపొందారు. ఈ పోటీలో చీడికాడ మండలం అర్జునగిరి గ్రామానికి చెందిన పరవాడ నాయుడుబాబు ఎడ్లు ప్రథమ స్థానం రాగా, అదే మండలం కేఎల్‌బీ.పట్నంకి చెందిన బండారు హిమతేజ ఎడ్లు ద్వితీయ స్థానం, విజయనగరం జిల్లా వెలంపూడి గ్రామానికి చెందిన సిద్ధివినాయక ఎద్దులకు మూడవ స్థానంలో నిలిచాయి.

నేడు 'పల్లె పండగ' ప్రారంభం

▸ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు ▸ ఏటికొప్పాకలో వేడుకకు ఎమ్మెల్యే హాజరు

ఎలమంచిలి, అక్టోబరు 13 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. తొలి రోజు మండలంలోని మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ హాజరు కానున్నారని తెలిపారు. అనంతరం పీఎస్‌ఆర్‌పేట, బయ్యవరం, ములకలాపల్లి, పులపర్తి, క్రిష్ణాపురం, లక్కవరం, పోతిరెడ్డిపాలెం, రుక్మిణిపురం గ్రామాల్లో ఈ కార్యక్రమం జరగనుంది.

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంపీడీవో ఎ.రవికుమార్ తెలిపారు. ఉదయం పది గంటలకు వెదురుపర్తిలో ప్రారంభమైన అనంతరం బయ్యవరం, విసన్నపేట, కశింకోటలలో నిర్వహించనున్నామని వివరించారు.

'18 మద్యం షాపులకు 366 దరఖాస్తులు'

పాయకరావుపేట, అక్టోబరు 13 : ఇక్కడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న 18 మద్యం షాపులకు 366 దరఖాస్తులు వచ్చినట్టు సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. పాయకరావుపేట మండలంలో ఆరు మద్యం షాపులకు 133 దరఖాస్తులు, నక్కపల్లి మండలంలో ఐదు షాపులకు 107, ఎస్.రాయవరం మండలంలో ఏడు మద్యం షాపులకు 126 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఒక్కొక్క దరఖాస్తు దారుడు రూ.రెండు లక్షలు డీడీ ద్వారా చెల్లించగా వీటిద్వారా ప్రభుత్వానికి రూ.7.36 కోట్లు ఆదాయం సమకూరిందని వివరించారు. సోమవారం అనకాపల్లిలోని సత్యవేణి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయింపు ఉంటుందని, లాటరీలో మద్యం దుకాణాన్ని దక్కించుకున్నవారికి రెండేళ్ల కాలపరిమితి ఉంటుందని తెలిపారు.

కోటవురట్ల హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సందడి



పాఠశాలలో కలుసుకున్న 1999-2000 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కోటవురట్ల, అక్టోబర్ 13 : ఇక్కడి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నవారంతా ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా హాజరు కావడంతో తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకురించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చేర్పిన ఉపాధ్యాయులు ప్రసాదరావు, యు.ఎస్.ఎన్.రాజు, అప్పలరాజు, మల్లీశ్వరి, మూర్తిలను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాల అనంతరం ఆటపాటలతో సరదాగా సాయంత్రం వరకు గడిపారు.

మరిడి మహాలక్ష్మి హారం వివాదంపై త్వరలో విచారణ

- బంగారం ఆభరణాలలో గిల్ట్ నగ పెట్టారని ఆరోపణలు
- ఈవో గంగారావుని సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు
- హైకోర్టుని ఆశ్రయించిన కార్యనిర్వాహణాధికారి
- శాఖా పరమైన విచారణకు ఆదేశాల జారీ చేసిన హైకోర్టు

నర్సీపట్నం, అక్టోబరు 13 : మరిడి మహాలక్ష్మి అమ్మవారి హారం వివాదంపై శాఖా పరమైన విచారణకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అమ్మవారి బంగారు ఆభరణాలలో 390 గ్రాముల హారం గిల్ట్ నగ నిర్ధారణ కావడంతో తీవ్ర సంచలనంగా మారింది. ఇందుకు బాధ్యుడిని చేస్తూ ఆలయ ఈవో గంగారావుని దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆయన్ని సస్పెండ్ చేశారు. తాను ఏ తప్పు చేయలేదని, సస్పెన్షన్‌ని ఎత్తివేయాలని ఈవో గంగారావు హైకోర్టుని ఆశ్రయించారు. దీంతో హైకోర్టు శాఖా పరమైన విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. వివరాల్లోకి వెళితే..

నర్సీపట్నం మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయం పూర్వం నుంచి అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యుల నిర్వహణలో ఉండేది. ఆలయంలో అర్చకుల జీతాలు, కరెంటు బిల్లులు, పండగ వ్యవహారాలు వారి కుటుంబ సభ్యులు చూసుకునేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2022 ఆగస్టు 2 తేదీన ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నారు. ఆ ఏడాది జరిగిన పండగలో అమ్మవారికి ఆభరణాలు అలంకరించ లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 19 తేదీన మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసపాత్రుడు 510 గ్రాముల బంగారం ఆభరణాలు, ఐదున్నర కిలోల వెండి వస్తువులను దేవదాయ శాఖ అధికారులకు అప్పగించారు. దేవదాయ శాఖ నగల వెరిఫికేషన్ అధికారి, ఎప్రైజర్ (బంగారం నాణ్యత నిర్ధారణ ప్రతినిధి) నగలు పరిశీలించి, బంగారం ఆభరణాలుగా నిర్ధారించారు. నగలు వివరాలు అధికారికంగా రికార్డులలో నమోదు చేసి ఈవో గంగారావు, జేవీవో, ఎప్రైజర్ సంతకాలు చేశారు. మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా ఏప్రిల్ 21 తేదీన బంగారు నగలు అమ్మవారికి అలంకరించడానికి ఈవో గంగారావు అర్చకులకు అందజేశారు. పండగ ముగిసిన తర్వాత మే 2 తేదీన దేవదాయ శాఖ ఈవో అర్చకుల నుంచి నగలు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు లాకరులో పెట్టడానికి అవకాశం లేక ఒక బాక్సులో ఆభరణాలు పెట్టి సీల్ చేసి నర్సీపట్నం సబ్ ట్రెజరీలో భద్రపరిచారు.

గిల్ట్ నగ అని తేలిందే అప్పుడే..

రెండేళ్ల క్రితం దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకున్న మరిడితల్లి ఆలయం నిర్వహణను ఆగస్టు నెలలో ఆలయ


మరిడితల్లి అమ్మవారు

ధర్మకర్త, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ అధికారులు అమ్మవారి ఆభరణాలు అప్పగించేటప్పుడు స్పీకర్ బంగారం నాణ్యత నిర్ధారణ చేయించారు. ఆభరణాలలో 390 గాములు బరువు ఉన్న అమ్మవారి హారం గిల్ట్ నగ అని తేలడంతో ఎండోమెంట్ అధికారుల నుంచి సభాపతి అయ్యన్నపాత్రుడు నగలు తీసుకోలేదు. ఆగస్టు 22 తేదీన దేవదాయ శాఖ జిల్లా అధికారి సుధారాణి నర్సీపట్నం ఎండోమెంట్ కార్యాలయంలో జేవీవో, ఎప్రైజర్‌ని పిలిపించి మరోసారి నగలు తనిఖీ చేశారు. హారం గిల్ట్ అని తేలడంతో ఎండోమెంట్ కమిషనర్‌కి నివేదిక పంపారు. దీని మీద ఇన్‌చార్జి ఈవో దివ్యజ్యోతి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ప్రమేయం లేకుండా ట్రెజరీ నుంచి బంగారం ఆభరణాలు బయటకు తీసుకు వెళ్లారని ఈవో గంగారావు కూడా దివ్య జ్యోతి మీద పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసుల విచారణ ముందుకు కదల లేదు. ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాలతో జిల్లా అధికారులు ఈవో గంగారావుని విధుల నుంచి సస్పెండ్ చేశారు. దీనిపై ఈవో గంగారావు హైకోర్టుని ఆశ్రయించారు. తాను ఏ తప్పు చేయలేదని, తనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేయాలని కోర్టుని కోరారు. దీని మీద విచారణ జరిగిపిన హైకోర్టు శాఖా పరమైన విచారణ చేసి నివేదిక ఇవ్వాలని దేవాదాయ శాఖకు ఆదేశాలు జారీ చేసింది.

పోటాపోటీగా ఎడ్ల పరుగు పందెం


గ్రౌండ్‌లో పరుగులు తీస్తున్న ఎడ్ల బండి

చీడికాడ, అక్టోబరు 13: మండలంలోని అప్పలరాజుపురంలో శనివారం సాయంత్రం ఎడ్ల పరుగు పోటీలు సందడిగా జరిగాయి. దసరా నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా జరిగిన పోటీలకు అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన 25 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో విజేతలు సెకండ్ల తేడాలో గెలుపొందారు. ఈ పోటీలో చీడికాడ మండలం అర్జునగిరి గ్రామానికి చెందిన పరవాడ నాయుడుబాబు ఎడ్లు ప్రథమ స్థానం రాగా, అదే మండలం కేఎల్‌బీ.పట్నంకి చెందిన బండారు హిమతేజ ఎడ్లు ద్వితీయ స్థానం, విజయనగరం జిల్లా వెలంపూడి గ్రామానికి చెందిన సిద్ధివినాయక ఎద్దులకు మూడవ స్థానం రాగా, నాలుగు, ఐదు, ఏడవ బహుమతులు అనకాపల్లి జిల్లా పేరపు నూకరాజు, కోయిలాడ మోహన్, నాగమణి ఎద్దులకు దక్కాయి. ఆరో బహుమతి విజయనగరం జిల్లా వాయిలపాడుకు చెందిన గండి వెంకటరావు ఎద్దులకు దక్కాయి. దాతల సహాయంతో విజేతలకు రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయలను ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, గ్రామ పెద్దలు చుక్క సోమునాయుడు, కురచా శ్రీను, కురచా నారాయణమూర్తి అందజేశారు.

పర్యాటక పరవశం

- మన్యంలో సందర్శకుల సందడి
- పాలసంద్రాన్ని తలపించిన చెరువులవేనం, వంజంగి హిల్స్
- ఎక్కడ చూసినా పర్యాటకుల కోలాహలం


చెరువులవేనంలో మంచు మేఘాలను తిలకిస్తున్న పర్యాటకులు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యంలోని పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం సందడి మొదలైంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో పాటు ప్రకృతి అందాలు మరింత సుందరంగా దర్శనమిస్తుండడంతో జనం మన్యం బాటపడుతున్నారు. దీంతో ఆదివారం ఏజెన్సీలో ఎక్కడ చూసినా సందర్శకులే దర్శనమిచ్చారు. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు సందడి కనిపించింది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, కటిక, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, గిరి గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి గెడ్డ, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువులవేనం మేఘాల కొండ, లంబసింగి, యర్రవరం జలపాతం తదితర ప్రాంతాలను పర్యాటకులు సందర్శించారు. ఏజెన్సీలో పర్యాటకుల తాకిడి పెరగడంతో పాటు పిక్నిక్‌ల సీజన్ కొనసాగుతుందని స్థానిక చెబుతున్నారు.

వంజంగి హిల్స్ వద్ద..

పాడేరురూరల్: మండలంలోని వంజంగి హిల్స్ పర్యాటకులతో ఆదివారం సందడిగా మారింది. పచ్చని కొండలను తాకుతూ దట్టంగా అలుముకున్న మంచు మేఘాలు పాల సంద్రాన్ని తలపించాయి. దసరా సెలవులకు తోడు ఆదివారం కావడంతో పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు శనివారం సాయంత్రమే పాడేరు చేరుకున్నారు. రాత్రి అక్కడ బస చేసి ఆదివారం వేకువజామున 5 గంటలకు వంజంగి హిల్స్‌కు చేరుకున్నారు. అక్కడి మంచు అందాలను చూసి పరవశించిపోయారు.

లంబసింగిలో..

చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగి ప్రకృతి అందాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద ఆవిష్కృతమవుతున్న మంచు మేఘాలు పర్యాటకుల మదిని దోచేస్తున్నాయి. ఆదివారం వీకెండ్, సంక్రాంతి సెలవులు కలిసిరావడంతో భారీ సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. ఉదయం ఐదు గంటల నుంచే లంబసింగి జంక్షన్, తాజంగి జలాశయం, చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి ప్రారంభమైంది. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పచ్చని అడవులను తాకుతూ పయనిస్తున్న మంచు మేఘాలను పర్యాటకులు ఆస్వాదించారు.

అరకులోయలో..

అరకులోయ: పర్యాటకులతో అరకుతో పాటు పరిసర ప్రాంతాలు ఆదివారం రద్దీగా కనిపించాయి. పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, ఘాట్‌రోడ్డులోని గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట కాఫీ తోటలు సందర్శకులతో కిటకిటలాడాయి. గిరిజన మ్యూజియం ఆవరణలోని కళాగ్రామంలో థింసా కళాకారుల ప్రతిమల వద్ద పర్యాటకులు ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

కొత్తపల్లి జలపాతం వద్ద..

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. మైదాన ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సమేతంగా వచ్చి సందడి చేశారు. పర్యాటకులతో ఈ ప్రాంతం కిటకిటలాడింది.

బొర్రాగుహలు వద్ద..

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. దసరా సెలవుల నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. శనివారం 4వేల మంది గుహలను సందర్శించగా.. రూ.4.50 లక్షల ఆదాయం వచ్చిందని, మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు.


బొర్రాగుహల్లో పర్యాటకులు

నేత్రపర్వంగా దుర్గమ్మ ఊరేగింపు

- ఘనంగా ముగిసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు
- వాడవాడలా లడ్డూల వేలం పాట..


నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో హారతి అందుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు


నర్సీపట్నం దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు కోలాహం

నర్సీపట్నం, అక్టోబరు 13 : దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం దుర్గమ్మ ఉత్సవ విగ్రహం ఊరేగింపు నేత్ర పర్వంగా సాగింది. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎండోమెంట్ అధికారులు స్పీకర్ దంపతులను సత్కరించారు. అనంతరం సభాపతి ఊరేగింపులో పాల్గొన్నారు. శక్తివేషాలు, డప్పులు, కోలాటం ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, చింతకాయల రాజేశ్, ఎండోమెంట్ ఈవో సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఒకటో వార్డు, వెంకునాయుడుపేటలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఒకటో వార్డులో లాలం మురళీ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారి ఘటాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

బుచ్చెయ్యపేటలో..

మండల కేంద్రంలోని దుర్గామల్లేశ్వరి ఆలయం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సీతయ్యపేటలో దుర్గామల్లేశ్వరి ఆలయం, వడ్డాది, లోపూడి, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేట, పెదపూడి, రాజాం, తురకలపూడి, గున్నెంపూడి, కొండపాలెం తదితర గ్రామాల్లో అమ్మవారి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు చేసిన అమ్మవారి నామస్మరణలతో ఆలయాలు, మండపాల ఆవరణలు మారుమోగాయి.

రోలుగుంటలో..

మండలంని కుసర్లపూడి, కొమరవోలు, బుచ్చెంపేట, రోలుగుంట, కొండపాలెం, కొవ్వూరు. కొంతలం తదితర గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో చివరి రోజు దుర్గామాత విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించి ఘనంగా నిమజ్జనం చేశారు.

కృష్ణాదేవిపేటలో..

గొలుగొండ మండలం ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, సీహెచ్.నాగాపురం, చోద్యం, లింగంపేట, కొంగసింగి తదితర గ్రామాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా కనకదుర్గ ఆలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలతోపాటు భజనలు, అగ్నిగుండాలను తొక్కుతూ భవాని భక్తులు పూజలు చేశారు. అమ్మవారి విగ్రహాలను బొడ్డేరు గెడ్డలో నిమజ్జనం చేశారు.

మాకవరపాలెంలో..

మండలంలో పలు గ్రామాల్లో దసరా నవరాత్రులు ముగియడంతో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. బూరుగుపాలెంలో అమ్మవారి మండపంలో లడ్డూ వేలం వేయగా సర్పంచ్ ఓబ్బలరెడ్డి వెంకటరమణ


గొలుగొండ: ఏటిగైరంపేటలో దుర్గాదేవి ఊరేగింపులో కోలాటం


మాడుగుల రూరల్: ఎం.కోటపాడులో సారె ఊరేగిస్తున్న భవానీ భక్తులు

రూ.35 వేలకు దక్కించుకున్నారు. అలాగే తూటిపాలలో ఆలయకమిటీ సభ్యుడు రుత్తల రాజబాబు ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. మాకవరపాలెం కొత్తవీధిలో వెలసిన అమ్మవారిని నిమజ్జనం చేశారు.

మాడుగుల రూరల్‌లో..

మండలంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. పలు గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అమ్మవారికి చీరలు, పండ్లు, స్వీట్లు సమర్పించి సారెతో గ్రామ పురవీధుల్లో ఊగేరించి నిమజ్జనం చేశారు. ఎం.కోటపాడు, ఎంకే. వల్లాపురంలో భవానీ మాలధారణ భక్తులు సారె ఊరేగింపును ఘనంగా జరిపారు. కేజేపురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి పూజలు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండారావు ఆధ్వర్యంలో ఘనంగా చేశారు. సామూహిక కుంకుమ పూజలు, జమ్మిచెట్టుకి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించి అన్నప్రసాదం పంచి పెట్టారు.

చీడికాడలో..

మండలంలోని అప్పలరాజుపురం, చీడికాడ గ్రామాల్లో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చీడికాడలో దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహి స్తుండగా, అప్పలరాజుపురం లలితాదేవి ఆలయంలో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చుక్క అప్పలనాయుడు, కురచా నారాయణమూర్తి, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో దుర్గమ్మ అమ్మవారి రెండు లడ్డూలను శనివారం వేలం వేయగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేరపురెడ్డి శ్రీనివాసరావు రూ.25వేలకు సొంతం చేసుకున్నారు.

దేవరాపల్లిలో..

మండలంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దేవరాపల్లి, నాగయ్యపేట, సీతంపేట, కింతాడ పలు గ్రామాల్లో దుర్గాదేవికి పూజలు ఘనంగా నిర్వహించారు. నిమజ్జనంలో మహిళల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గొలుగొండలో..

మండలంలోని గొలుగొండ, చీడిగుమ్మల, పాకలపాడు, శ్రీరాంపురం, ఏటిగైరంపేట, జోగంపేట, ద్వారకానగరం, పప్పుశెట్టిపాలెం, కొత్తమల్లంపేట, కొత్తఎల్లవరం, గుండుపాల గ్రామాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


పాతకృష్ణాదేవిపేటలో అమ్మవారిని నిమజ్జన ఊరేగింపు చేస్తున్న భక్తులు


మాకవరపాలెం: తూటిపాలలో అమ్మవారి ఊరేగింపులో కోలాటం

రోడ్డుపైకి తుప్పలు.. వాహనదారుల అగచాట్లు

గొలుగొండ, అక్టోబరు 13: ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డుపైకి తుప్పలు రావడంతో వాహనదారులకు అగచాట్లు తప్పడం లేదు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకు చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని నర్సీపట్నం నుంచి కృష్ణాదేవిపేట వెళ్లే రహదారిలో చీడిగుమ్మల నుంచి జోగంపేట జంక్షన్ వరకూ రోడ్డుపైకి తుప్పలు వచ్చేశాయి. అలాగే మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొందని వాహన చోదకులు అంటున్నారు. రోడ్డుపైకి తుప్పలు రావడంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తోందోనని వారంటున్నారు. అధికారులు స్పందించి తుప్పలు తొలగించే కార్యక్రమం చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



అల్లూరి పార్కులో పాడైన బోరు మోటారు

- 19 రోజులుగా తాగునీటికి పర్యాటకుల అవస్థలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 13 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో మోటారు 19 రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో పర్యాటకులకు, పార్కులోని మొక్కలకు నీరు లేకుండా పోయింది. బోరు మోటారు మరమ్మతులకు గురైన విషయాన్ని పలుమార్లు అధికారులకు, పాలకులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పర్యాటకులు వాపోతున్నారు. ఏటా పలుమార్లు మోటారు పనిచేయకపోయినా అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేయించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో తరచూ తాగునీటి సమస్య


నిరుపయోగంగా ఉన్న కొళాయి

తప్పడం లేదు. ప్రస్తుతం కాస్తున్న ఎండలకు విలువైన మొక్కలు ఎండి పార్కులో అందాలు కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. మోటారుకు మరమ్మతులు చేయించాలని, లేకుంటే కొత్త మోటారు వేయించాలని గ్రామస్థులు, పర్యాటకులు కోరుతున్నారు.

పల్లె పండుగను విజయవంతం చేయాలి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 13: ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కోరారు. 16న కోమళ్లపూడి, ఎల్‌బీపీ.అగ్రహారం, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, పెదమదీన, చినమదీన, కరక ఈతయ్యపేట, పెదపూడి, పీపీ.అగ్రహారం, 17న చినప్పన్నపాలెం, ఐతంపూడి, కందిపూడి, కేవీ.అగ్రహారం, కొండపాలెం, గున్నెంపూడి, నీలకంఠాపురం, రాజాం, ఆర్.భీమవరం, ఆర్.శివరామపురం, 18న మల్లాం, లైపురం, చిట్టియ్యపాలెం, తురకలపూడి, చింతపాక, మంగళాపురం, విజయరామరాజుపేట, వడ్డాది, లోపూడి, ఎల్.సింగవరం, 19న పొట్టిదొరపాలెం, గంటికొర్లాం, కొండెంపూడి, పోలేపల్లి, పి.భీమవరం గ్రామాల్లో పల్లె పండుగను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు.

సంక్షిప్తంగా..

కృష్ణాదేవిపేట ఎస్‌ఐగా తారకేశ్వరరావు బాధ్యతల స్వీకారం



కృష్ణాదేవిపేట, అక్టోబరు 13: కృష్ణాదేవిపేట ఎస్‌ఐగా వై.తారకేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ టి.దివ్యను నెల రోజులకే అనకాపల్లి ఎస్‌బీకి పంపారు. ఇంటిలిజెన్స్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న తారకేశ్వరరావును ఎస్‌ఐగా ఇక్కడ నియమించారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ తారకేశ్వరరావు మాట్లాడుతూ గంజాయి రవాణా, సారా, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

అనారోగ్యంతో టీడీపీ వార్డు మెంబరు మృతి


మోహన్‌రావు (ఫైల్)

చీడికాడ, అక్టోబరు 13: మండలంలో దిబ్బపాలెంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పంచాయతీ వార్డు మెంబరు దారపు మోహన్‌రావు(35) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. రెండేళ్ల క్రితం ఈయన రెండు కిడ్నీలు కోల్పోయాయి. చిన్న వయస్సులో మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

రోడ్లకు శంకుస్థాపన చేయాలి

రోలుగుంట, అక్టోబరు 13 : సోమవారం నుంచి నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గిరిజన గ్రామాలకు మంజూరైన రోడ్లకు శంకుస్థాపన చేయాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. వైబీపట్నం నుంచి లోసింగి మీదుగా పెదగరువు గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని, అలాగే ఎంకేపట్నం నుంచి కొరుప్రోలుకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఆయా రహదారులకు నేటికీ శంకుస్థాపనలు చేయలేదన్నారు. తక్షణమే ఈ పల్లె పండుగ కార్యక్రమంలోనైనా పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

పల్లె పండుగలో పాల్గొనండి : టీడీపీ


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నాతవరం, అక్టోబరు 13 : ఈనెల 14వ తేదీ నుంచి చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని కూటమి నాయకులు విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ కోరారు. ఆదివారం ఇక్కడ టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మండలంలోని 26 పంచాయతీలలో రూ.13 కోట్లతో 57 పనుల అభివృద్ధి పనులను పల్లెపండుగలో చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచులు, కూటమి నాయకులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో టీడీపీ నేతలు కరక సత్యనారాయణ, పారుపల్లి కొండబాబు, ఎన్. విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ని విడుదల చేస్తున్న దృశ్యం

నాతవరం, అక్టోబరు 13 : వచ్చే ఏడాది జనవరి 11న నాతవరంలో తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులచే ఎస్ఆర్ఐ శెట్టి సతీష్ మిత్రబృందం నిర్వహించనున్న శ్రీనివాస కల్యాణం పోస్టర్‌ను జడ్పీటీసీ మాజీ సభ్యులు కరక సత్యనారాయణ మండల నాయకులతో కలసి ఆదివారం ఆవిష్కరించారు. జనవరి 11న ఫారెస్టు గ్రౌండ్‌లో నిర్వహించే శ్రీనివాస కల్యాణాన్ని తిరుపతిలో ఏ విధంగా నిర్వహిస్తారో అదేవిధంగా సుప్రభాత సేవతో ప్రారంభమవుతుందన్నారు. తోమల సేవ, మహాప్రసాద వితరణ, శాస్త్రదీపాలంకరణ, పల్లకీ సేవ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే దంపతులు ఇప్పటినుంచే నాతవరం శ్రీశక్తి పంచాయత ఆలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎన్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, పారుపల్లి కొండబాబు, అపిరెడ్డి మాణిక్యం, పైల సూరిబాబు, శెట్టి లోవ, శెట్టి నానాజీ, చింతకాయల శ్రీనువాసు, శెట్టి గోపీ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు అధికారులు చొరవ చూపాలి


మాట్లాడుతున్న పరిరక్షణ సమితి సభ్యులు

దేవరాపల్లి, అక్టోబరు 13 : మండలంలో కబ్జాలకు గురవుతున్న చెరువుల పరిరక్షణపై అధికారులు చొరవ చూపాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి మాడుగుల నియోజకవర్గ కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం తిమిరాంలో జల వనరుల పరిరక్షణ యాత్రంలో భాగంగా సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, ప్రభుత్వ భూములకు పరిరక్షణ కల్పించాల్సిన అధికారులు వారి నిర్లక్ష్యం వల్ల చెరువుల రక్షణ ప్రశ్నార్థకమైందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రఘు చక్రవర్తి, అల్లు సత్యం, గోవిందరావు, గోపాలరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.